# కనువిప్పు

"అబ్బాయి! మోహన్! ఏమిటిరా, నీ సంగతి నాకేమీ అర్థం కావడం లేదు. ఎన్నాళ్లిల్లా ఉంటావు మోడులాగ"

"........."

"వివాహం చేసుకుంటాననో, చేసుకోననో ఖచ్చితంగా చెప్పేయరాదూ. ఇక మళ్ళీ నేనా ప్రస్తావన చేయనుగా నీతో"

"........

"ఎన్నాళ్ళిట్లా మీనమేషాలు లెక్కపెడుతూ కూర్చుంటావు. 25 సంవత్సరాలు దాటినై. వయస్సు మీరిపోతున్నది. వచ్చిన సంబంధాలు వచ్చినట్టే వచ్చి తిరిగి పోతున్నవి. అవుననవు, కాదనవు. నీ ఆలోచనలేమిటో నాకు తెలియడం లేదు. రోజుకిరవై నాలుగు గంటలూ, మున్నూట అరవై నాలుగు రోజులూ ఇట్లారంగులూ, కుంచెలూ ముందేసుకొని బొమ్మలు గీస్తూ కూర్చుంటావు: పెళ్ళక్కరలేదనుకొన్నావా? అదైనా చెప్పు!"

"అక్కరలేదని నేనన్నానా కక్కా"

"పెళ్ళిపిల్లని చూచుకొని రమ్మంటే కదలవు. నువ్వు చూచుకొని వస్తే కాని ఖాయ పరచడానికి వీలులేకపోయె ఎట్లారా మరి? ఆడపిల్లల తండ్రులయితే మట్టుకు మన చుట్టూ ఎన్నాళ్ళిట్లా తిరుగుతారురా! మనకిది మర్యాద కాదురా మోహన్"

"నన్నేం చెయ్యమంటారు."

"ఇదుగో చూడు: మూడు ఫోటోలు తెప్పించాను. ఈ ముగ్గిరిలో నీకే పిల్ల నచ్చిందో చెప్పు. మనిద్దరం వెళ్ళి చూచి వద్దాం." మోహనరావు పలుకలేదు. ఫోటో చూచి ఊరుకున్నాడు.

"ఏమిటి నీ ఉద్దేశ్యం. ఈ పిల్లలు నీకు నచ్చలే?"

"ఫోటోలు చూస్తే ఏం తెలుస్తుంది."

"అయితే వెళదాం పద స్వయంగా వెళ్ళి చూచి వద్దాం పద. ఏమంటావు!" మోహనరావు పలుకలేదు.

నిరంజనరావు క్షణం నిదానించి అతని వేపు చూచాడు. మోహనరావు గుడ్డ కట్టిన ఫ్రేము ముందేసుకొని రంగులతో రాధాకృష్ణుల చిత్రం వ్రాస్తున్నాడు. నింజనరావుకు దుఃఖం వచ్చింది. కంటనీరు గ్రుక్కి,

"అబ్బాయీ! నా బాధ ఎటువంటిదో నీవు తెలుసుకోలేకుండా ఉన్నావు" అని కళ్ళు తుడుచుకున్నాడు.

"కక్కా! నాకు లేని బాధ నీకెందుకు? నేను వివాహం చేసుకోకపోతే మీ రెందు కిట్లా బాధపడడం."

"అంతేనా? ఇదేనా నీవు గ్రహించింది చూడు: అట్లాచూడు: నీవు గీచినదే ఆ చిత్రపటం. నీ తండ్రిది, నీ తల్లిది; నిన్ను కనడం మాత్రం వాండ్ల వంతయింది; పెంచడం నా వంతయింది; నీ తండ్రి నేనూ ఏక గర్భ జనితులమయినా, మేము లోకంలోని అన్నదమ్ములలా జీవించలేదు. మమ్మల్ని చూచి రామ లక్ష్మణులనుకొనేది లోకం. నీవు నీ తండ్రి నెట్లా ఎరగవో, నేనూ నా తండ్రిని తల్లిని చిన్నప్పుడే పోగొట్టుకొన్నాను. మీ అమ్మనే మా అమ్మ అనుకున్నాను. మీ తండ్రినే నా తండ్రి అనుకొన్నాను. వాండ్లిద్దరూ నన్ను ఆ విధంగానే పెంచారు, పెద్దవాణ్ణి చేశారు. నిన్ను చూచుకొని ఆనందించే యోగ్యత ఆ దంపతులకు లేకపోయింది. నిన్ను నాచేతిలో పెట్టి ప్రాణాలు వదిలారు, ఆ పుణ్యదంపతులు." అని చిత్రపటం చూచి కన్నీరు నింపాడు, నిరంజనరావు.

"ఏమిటిది కక్కా! కళ్ళ నీళ్లెట్టుకుంటున్నారా?"

"నాయనా నా బాధ నీకేం తెలుస్తుంది. నీకు పాతిక సంవత్సరాలు దాటినా నేనుండి కూడా నీకు వివాహం కాలేదని తలచుకుంటే నాకు దుఃఖం కదరా నీ కేమి లోటు. జమీందారీ కుటుంబం. తినేవాండ్లులేరు. సాలుకు పది పన్నెండువేలు నికరాదాయం వచ్చే ఆస్తి, ఇల్లు, మేడ, తోట, దొడ్డి. నీవా "బి.ఏ." పట్టా పుచ్చుకొన్నావు. మేలిమి బంగారు ఛాయ

నీ శరీరం. దివ్యమంగళ విగ్రహానివి. నువ్వు సరేనంటే బంగారు ప్రతిమల వంటి పిల్లలను నీ కాళ్ళమీద పడేసి, బ్రహ్మాండంగా వివాహంచేసి పంపడాని కెంతమందో పోటీలు వేసుకొని తిరిగి పోతున్నారు.........కాని.........

మోహనరావు పలకలేదు.

"నాయనా! నాకాయోగంలేదు. నీ వివాహవైభవం, నీవు, నీ భార్య కాపరం చేస్తుంటే చూచి ఆనందించే యోగం నా నుదుటి మీద లేదు నీ తల్లి తండ్రులలాగే నేనూ దరిద్రుణ్ణి మోహన్!

మోహనరావు చిరునవ్వు నవ్వి

"కక్కా! వివాహ సంస్థమీద ఇంత మమకారం గల మీరు ఎందుకు వివాహం చేసుకోకుండా ఇట్లా కఠోర బ్రహ్మచర్యం సాగిస్తున్నారు."

"అదా! నీ సందేహం అందుకని నా మీద పంతంపట్టి కూర్చున్నావా? ఇంకా పది కాలాలపాటు నీ తల్లి తండ్రులు జీవించి యుంటే నేనూ వివాహం చేసుకొని ఉండేవాణ్ణి. కానీ వాండ్లిద్దరూ గతించి, నిన్నూ నన్నూ, ఏ కాకిని చేసి పోయారు. నేను వివాహం చేసుకొంటే నీ పోషణకేం ఆటం కాలు బయల్దేరుతాయో అని భయపడి నేను చేసుకోలేదు నాయనా! నా విషయం నీవు విచారించవలసిన అవసరంలేదు. వెళ్ళిపోయింది నా కాలం. నా తనువు 50 దాటి అరవైలో పడింది. నాకు వివాహం కాలేదన్న బెంగ నాకు లేదు. నీవు వివాహం చేసుకొని, నీ కడుపు ఫలిస్తే మా వంశం నిలబెట్టిన వాడవవుతావు. ఇదే నా కోరిక.

వింటూనే మోహనరావు బొమ్మ గీసుకొంటున్నాడు.

"లే నాయనా: లే! ఈ రోజే బయల్దేరి వెళ్ళుదాం పద: నీకు ఏ పిల్ల వచ్చితే ఆపిల్లనే తెచ్చి వివాహం చేస్తాను.

మోహనరావు పలుకలేదు.

"నీకెటువంటి భార్య కావాలో నాతో చెప్పు. సిగ్గుపడకు. సందేహించకు కాలికి బలపం కట్టుకొని తిరిగి నీవు కోరుకున్న పిల్లని ఏరి తీసుకొని వస్తాను సరేనా!

"ఏ౦దుకంత కష్టం కక్కా?

"నాకిది కష్టంకాదు నాయనా! చెప్పు నీకు కావలసినది రూపమా, సౌందర్యమా, చదువా, గుణమా, సంగీతమా, నాట్యమా, సంప్రదాయమా, లేక ఇవన్నీనా! చెప్పు నాయనా ! నీ కోరిక నేరిన పిల్లని తీసుకొని వస్తాను.

"భార్య ఎడల భర్తకోరుకొనే వరాలన్నీ మీరే ఏకరువు పెట్టారుకా, ఇక నన్నడగడం దేనికి.

"నీ కోరిక ప్రకారం, నీ అభిప్రాయం ప్రకారం జరగవలసిన వ్యవహారం కాబట్టి ఇంతదూరం ప్రశ్నిస్తున్నాను నాయనా!

"మీరు అడిగారు కాబట్టి చెపుతున్నాను మీరు చెప్పిన అర్హతలన్నీ కలిగిన భార్యే నాకు కావాలి; అటువంటి స్త్రీని మీరు సంపాదించగలరా"

"ఓ చిటికెలో,

"మీ చేతకాదు: మీరు సంపాదించలేరు. వివాహం విషయమై నాకు కొన్ని పిచ్చి ఆదర్శాలున్నవి. నా ఆదర్శాల కెంతమాత్రం భంగం వాటిల్లినా, అట్టి భార్యతో నేను సంసారం చేయలేను"

"నీ ఆదర్శా లెటువంటివో నాతో ఒక్క మాటయినా చెప్పేవా" చెప్పినంత మాత్రంచేత ప్రయోజన మేమిటి? నా ఆదర్శాలను నేనే పాటించుకొని నాకు భార్యకాదగ్గ స్త్రీని నేనే సృష్టించుకోవాలి! మీరు శ్రమపడకండి కక్కా! ...

పోనీ నీ వయినా నీ భార్యను సృష్టించుకొన్నావా? అదీ లేదు!

"అది వేరే విషయం అట్టి స్త్రీని నేను సృష్టించి తెచ్చుకోలేకపోతె అది నా చేతగానితనం. మీకు దిగులెందుకు"

"అటువంటి చేతగాని తనం నిన్ను ముంచేస్తుందనే నా విచారం"

"మీకా విచారం అక్కరలేదు కక్కా; నా ఊహాలోకంలో చిత్రించుకొన్న స్త్రీ ఎక్కడో జన్మించి వర్ధిల్లుతోంది. మే మిద్దరం సమాగమం కావడమే తరువాయి"

"ఎప్పుడు మికిద్దరి కట్టి సమాగమం"

"అది మీ చేతిలోనూ నా చేతిలోనూ లేని వ్యవహార కక్కా."

"అయితే అట్టి స్త్రీ నెవరినైనా నీవు ప్రేమించావా? అదైనా చెప్పు"

"అసలు ప్రేమతత్వం అంటే ఏమిటో అర్థంగాక కొట్టుకొంటున్న నేనెట్లా ప్రేమించగలను.

"అబ్బాయీ! నీ మాటలు నాకర్థం కావడంలేదు. నీ ఈడులో స్త్రీ పురుషుల ప్రేమానురాగాల తత్వం తెలియని యువకులుంటారా!"

"నే నున్నానుగా......నన్ను విడిచిపెట్టండి కక్కా.

నిరంజనరావు నిరుత్తరుడై పోయాడు.

"కక్కా క్షమించండి. ఇదిగో నేను వ్రాసే ఈ చిత్తరువు చూచారు కదూ ఇది రాధాకృష్ణుల చిత్రం. ఈ చిత్రం నా ప్రేమ తత్వానికి నిధానం కక్కా ఈచిత్రం పూర్తయే సరికి, నా జీవితంలో మీకు గోచరించే కొరత, లోటు, భర్తీఅయి మీ కానందం చేకూరుతుంది"

"మోహన్"

నిరంజనరావు మేడ మెట్లు దిగి కిందికి వెళ్ళిపోయాడు. ఎస్టేటంటే గొప్ప ఎస్టేటు కాకపోయినా ఒకరకమయిన చిన్నఎస్టేటే. దాని మేనేజిమెంటు యావత్తూ నిరంజనరావుది. మోహనరావుకి ఇంటి గొడవ లక్కర్లేదు. ఇంట్లో వంటబ్రాహ్మణుడు ఉండనే ఉన్నాడు. కావలసినంత విశాలమైన మేడ! బ్రహ్మాండమైన కాంపౌండు. కాంపౌండు నిండా క్రోటనులూ పూలమొక్కలూను. పూలమొక్కలకి నీళ్లు పోయడానికే మేడలో ఎప్పుడు ఏవస్తువు ఎక్కడఉంచి కాపాడాలో చూచుకోడానికే సుబ్బులని ఒక యానాది మనిషి ఉన్నాడు.

నిరంజనరావు మేడమెట్లు దిగి క్రిందికి వచ్చేసరికి ఉదయం 10 గం. లయింది. మోహనరావు వైఖరాయన కర్థంకాకుండా ఉన్నట్టూ కనిపించదు. మేజరయి పాతిక సంవత్సరాలీడు వచ్చిన యువకుని వివాహ సందర్భంలో తానెందుకు తాపత్రయ పడడం! మోహనరావన్నట్టూ ఆ విషయం అతని వ్యక్తిగతమైన వ్యవహారమేగదా? తాను బలవంతంచేస్తే మోహనుడు వివాహం చేసుకొంటాడా? గుర్రాన్ని చెరువు దగ్గరికి తీసుకు పోవచ్చుగాని, నీళ్లు తాగించడం ఎవరితరం?

నిజానికి సిమ్మిత పడవలసిన విషయమే అయినా నిరంజనరావు కెందుకో చికాకుగానే ఉంది.

అడుగులు వేసుకుంటూ, ఆలోచనతో తోటలో పోయేసరికి యానాది సుబ్బులు రేకుబుంగ తీసుకొని చెట్లకు నీళ్ళుపోస్తున్నాడు. మోహనరావు తండ్రి కాలంలో సుబ్బులు తండ్రి ఆ దేవిడిలోనే అంటిపెట్టుకొని బ్రతికాడు. తండ్రి గతించినవి మొదలు సుబ్బుకూడా మోహనరావునీ నిరంజనరావునీ ఆశ్రయించుకొని బ్రతుకుతున్నాడు. మోహనరావు మేడ మీద పెరుగుతుంటే మేడక్రింద సుబ్బులు పెరుగుతూ వచ్చాడు. సుబ్బునికి ఇక్కడనే భోజనం ఇక్కడనే పడక. పేరుకు మాత్రం వాడికి కాంపౌండులో చిన్న పూరిగుడిసె ఒకటున్నది. వాడికి నెలకి పదిరూపాయల జీతం.

చెట్లకు నీళ్ళుపోసేపని చాలించి

"దొరగారూ! దణ్ణం పెడతా" అన్నాడు సుబ్బులు

"ఏరా! ఏంకావాలి," అన్నాడు నిరంజనరావు

"మీరు కోపం చేయకుంటే ఒక్క సంగతి మనవి చేసుకొంటా"

"కోపం చేయనులే చెప్పు"

"నేను పెళ్ళి చేసుకొంటున్నా బాబూ! తమరు సహాయం చేయాలి."

"పెళ్లా? నీకా?.... ఎక్కడరా పిల్ల"

"మా మేనమామ కూతురు గడ్డమీది పల్లికాపరం"

"ఎన్నేళ్లుంటాయి"

"నా కంటే రెండేళ్లు చిన్నదండి."

"ఖాయం చేసుకొన్నావా పిల్లని"

"వచ్చే ఆదివారం మూర్తమండి"

"అబ్బాయితో చెప్పావా?"

"లేదండీ"

"ఏం"

"భయమండీ"

"ఎందుకు"

"చిన్న దొరగారికింకా పెళ్ళికాకుండా నేను చేసుకుంటున్నానంటే"

"ఆయనతో నీకు వంతా?"

"అయ్యబాబో! ఆరెక్కడ నే నెక్కడండి. ఏందో భీతి, సిగ్గూ వేసిందండి"

"పెళ్ళి కెంతకావాలి పైకం!"

"నాకు తెలియదండి. మీ దయండి"

"సరే నేనిస్తాలే పైకం"

సుబ్బులు సంబరు పడుతూ పనిలోకి వెళ్లిపోయాడు.

అతను పోయిన దారినే పోయింది నిరంజనరావు చూపు. సుబ్బాా నల్లగా ఉంటాడు. శరీరం రంగు తేడాకాని లేకుంటే మోహనరావుకీ సుబ్బులిదీ ఒకటే ఈడు. కాయకష్టంతో పని చేసే అలవాటేమో, సుబ్బులిది కండలు తేరిన దేహం! జవ్వనం కొత్తనెత్తురు ఉబికిన కన్నులు. పసిరిక పాములాంటి పసితనం, చురుకుతనం. బుంగ చేత పుట్టుకొని అంగలు వేసు కుంటూ వెళ్లే సుబ్బులుని చూస్తే ముచ్చట వేసింది నిరంజనరావుకి "చదువు లేకపోయినా వయసు వచ్చేసరికి పెండ్లి, పెండ్లి అని ఈ విధంగా అలవటించి పోతారు ఈ కాలంలో పిల్లవాండ్లు. మోహనుడి కాధ్యాసే ఉన్నట్టు కనిపించదు. ఏమిటో ఆశయాలట, ఆదర్శాలట అధ్యాస్నమట" అని లోపల ఏహో అనుకుంటూ భోజనానికి వెళ్ళిపోయాడు నిరంజనరావు.

## 2

ఆ సంవత్సరం అఖిల భారతీయ చిత్రకళా ప్రదర్శనం మద్రాసులో ఏర్పాట చేశారు. ఈ ప్రదర్శనానికి భారత దేశంలో పేరుబడ్డ చిత్రకారులు

చాలామంది చిత్రాలు వ్రాసి పంపించారు. మోహనరావు కూడా తాను వ్రాసిన రాధాకృష్ణుల చిత్రం ప్రదర్శనానికి పంపించాడు. ప్రదర్శనానికి వేయి చిత్రాలకు పైగా చేరాయి ఇందులో భారతీయ బాలల చిత్రకళాప్రౌఢుల చిత్రకళకూడా ప్రదర్శింపబడింది ప్రదర్శనం దర్శించడానికి రేనవేలు జనం వస్తున్నారు, పోతున్నారు. మోహనరావూ వెళ్లాడు. అతని రాధాకృష్ణుల చిత్రం చూచి చాలామంది, ఆహాహ! అంటున్నారు. అతని చిత్రం పక్కనే "వియోగజలధి" అని బెంగాలీ యువతి సుందరీబాయి చిత్రించిన చిత్రం ఆవిష్కరించారు. మోహనరావీ చిత్రాన్ని తిలకిస్తూ నిలబడ్డాడు. అతనికి కన్నీరు నిండింది. తాను వ్రాసిన రాధాకృష్ణుల చిత్రం చూచుకొన్నాడు. అందులో ప్రేమ తత్వం మూర్తీభవిస్తోంది. అతని కానందం కలిగింది "వియోగజలధి" తనకి అప్రయత్నంగా కన్నీరు నింపింది. ఎందువల్ల? ఈ చిత్రంలో ప్రేమతత్వం పొడగొట్టడంలేదా? తన పటంలో గోచరించే ఆనందరసమేమటి? వియోగజలధిలో గోచరించే దుఃఖరసమేమిటి? ఈ ఆనంద దుఃఖరసాలకు మూలస్థానమైన రసోత్పత్తి ఎటువంటిది?

మోహనరావు నిర్ఘాంత పోతున్నాడు: తదేకదృష్టితో తిలకిస్తున్నాడా రెండు చిత్రాలనూ, వాటిలోని ప్రతి చిన్నవిషయం ఒకదానికొకటి పోల్చి పరిశీలిస్తున్నాడు. అతడు తన్మయత్వం చెందిపోయాడు. ఈ రెంటిలో ఏది గొప్ప చిత్రమో నిర్ధారణ చేయలేక పోతున్నాడు.

ఇంతలో ఇరవై సంవత్సరాల యువతి. తెల్లని చీర ధరించి తలనిండా ముసుగువేసుకొని కంటికి బంగారుఫ్రేము అద్దాలు పెట్టుకొని వచ్చి మోహనరావు ప్రక్కనే నిలబడి రాధాకృష్ణుల చిత్రం వియోగజలధి చిత్రం, తిలకిస్తూ నిలబడింది. విస్తుపోయింది: ఆమె దృక్పథానికే యే స్మృతులు అడ్డుతగిలాయో రాధాకృష్ణుల చిత్రానికెదురుగా మోకరిల్లింది, చేతులు జోడించింది, కన్నులు కప్పుకొన్నది. పలవల ఏడ్చింది.

వచ్చేపోయే జనం: ఎవరిదారినవారు వస్తున్నారు, పోతున్నారు. మోహనరావుగాని కంట నీరుపెట్టే బెంగాలీ యువతిగాని ఎవరినీ ఎవరినీ

గమనించడమే లేదు. ఆయిద్దరూ చిత్తరువుల్లో చిత్తరువులై పోయి నిలబడ్డారు.

మోహనుడు ఆ యువతి ఏడ్పు మాత్రం లేకపోయాడు. ఆమెను భరించ లేకపోయాడు అక్కడ నిలవ లేక వెళ్ళిపోయాడు.

మరునాడు సభ జరిగింది. బెంగాలీ యువతీ సుందరీ బాయి వ్రాసిన వియోగ జలధి చిత్రానికి మొదటి బహుమానమున్నూ, మోహనుడు వ్రాసిన రాధాకృష్ణుల చిత్రానికి రెండవ బహుమానమున్నూ ఇచ్చింది సభ. మోహన రావు సభకు వెళ్లలేదు. తన బసలోనే నిలిచిపోయాడు. అతనికి మనస్సు మనస్సులో లేకుండా పోయింది.

ఉదయం 0 గంటలయింది. గదిలో ఒంటరిగా పడకకుర్చీలో కూర్చున్నాడు. ఆకాశంలో పయనించే తెల్లమబ్బు జంటల్ని కిటికీగుండా చూస్తున్నాడు. బ్రహ్మాండములను కాల్చివేసే అంశలావు సూర్యబింబమూ, ఆ మబ్బు పిల్లల చాటున చల్లగా పిల్లి అయి దాగుడుమూత లాడుతోంది అంతలో మబ్బులు విడిపోగానే నా అంతటివాడు లేడని విజృంభిస్తున్నాడు సూర్యుడు

రాధాకృష్ణుల ప్రేమే ప్రేమ. నిజంగా తాను ఆ ప్రేమను తన చిత్రంలో గొప్పగా చిత్రించాడు. అనుకోకూడదుగాని తాను పూర్తి చేసిన ఆ చిత్రాన్ని ప్రదర్శనశాలలో చుచుకొంటే అతనికే ముగ్ధత్వం ఆపాదించింది —కాని 'వియోగజలధి' చిత్రించినదెవరు? ఆమె స్త్రీ. బెంగాలీ ఆమె. పేరు సుందరీ బాయి. ఆమె చిత్రంలో ఎన్ని కావ్యాలు ప్రకాశిస్తున్నాయి. తాను వ్రాసిన చిత్రానికి ప్రేమ తత్వమే మూలం. 'వియోగజలధి'కో దానికే ప్రేమతత్వమో మూలం కాని, అది చూచినప్పుడు దుఃఖం పొంగింది. రాధాకృష్ణుల్ని చూచినప్పుడు ఆనందం పొంగింది. ఏమిటి చిత్రం. ఏమిటీ వైకల్పికం.

మోహనరావు హృదయం ఆకాశంలో శూన్యమైపోయింది. అతని మనస్సు గగనంలా ఖాళీ అయిపోయింది.... ఇంతలో ఎవరో మేడ మెట్లెక్కి-వస్తున్న చప్పుడు. లేచి తొంగి చూచాడు. ఎదురు వెళ్లాడు. మొన్నటి రోజున ప్రదర్శనశాలలో తన రాధాకృష్ణుల ఎదుట మోకరిల్లి దుఃఖించిన స్త్రీ.

ఆమెను ప్రత్యుద్ధానం చేశాడు,

ఆమె వచ్చి అతనికి నమస్కరించింది.

ఇద్దరూ గదిలో కూర్చున్నారు.

"ముందుగా కబురు పెట్టకుండా వచ్చి మిమ్మల్ని శ్రమపెట్టినందుకు క్షమించాలి" అన్నదామె.

"ఎంతమాట! మొన్న మిమ్మల్ని ప్రదర్శనలో చూచాను, అప్పుడే మిమ్మల్ని పలకరించాలనుకొన్నాను. కాని సమయం కాదనుకొన్నాను. ఇప్పుడు మీరిట్లారావడం నాకు పరమానందంగా ఉంది." అన్నాడు మోహన్!

"మీ రాధాకృష్ణుల చిత్రానికి ద్వితీయ బహుమానం. నా వియోగజలధికి ప్రథమ బహుమానం రావడం నిజంగా నాకు చిన్నతనంగా ఉంది." అని అన్నదామె."

ఏమిటి? మీరేనా సుందరీబాయి! ఆహా: ఏమిపర్వదినమండీ ఈరోజు నిజంగా మీ చిత్రం మొదటి బహుమానం పొందదగినదే: మీరట్లా అనకూడదు. అంతటి గొప్పచిత్రం వ్రాసినందుకు మీకు నా ధన్యవాదాలు."

"మీ మాటలు నాకు భారంగా ఉన్నాయి. అల్లా అనకండి మోహన రావుగారూ! మీ పేరుప్రతిష్టలు విన్నాను. మీరు వ్రాసిన చిత్రం చూచిన తర్వాత మిమ్ము స్వయంగా చూడకుండా ఉండలేక పోయాను. మీ అడ్రస్సు ప్రదర్శనశాల ఆఫీసులో తెలుసుకొని మీ దర్శనం నిమిత్తం ఇట్లా వచ్చాను."

"మీరాక నా అదృష్టాన్ని మీగొప్ప హృదయాన్నీ వేనోళ్ళ చాటుతున్నది."

"మీరు బహుమానం ౦దుకోడానికి నిన్న మీటింగుకి రాలేదేం"

"నాకు శరీరంలోను మనస్సులోనూ బాగుండక ఇల్లు కదలలేక పోయాను."

"ఇదుగో! మీకు నేను స్వయంగా బహుమానం అందజేయాలని తీసుకొని వచ్చాను."

అని పాకెట్టులో నుండి ఒక బంగారు పతకం తీసి అతని చేతిలో పెట్టింది.

అది గౌరవ పురస్సరంగా అతడు తీసుకొన్నాడు. ఆ పతకం మీద చెక్కిన అక్షరాలు చదువుకొన్నాడు. దానిలో సుందరీబాయికి బహూకరించిన ప్రధమ బహుమానం అని ఉన్నది.

"ఇదేమిటి! ఇది మీది."

"కాదు మీదే పతకం వెనకప్రక్క చదువుకోండి."

అతడు చదివాడు. సుందరీబాయి గౌరవపూర్వకంగా మోహనరావుకు బహూకరించినది" అని.

అతని కర్ధం కాలేద! ఈ పద్ధతి బాగుండలేదు వద్దన్నాడు. ఆమె తిరిగి తీసుకోడానికి నిరాకరించింది. తనవద్ద ఉంచుకొన్న రెండో బహుమానం అతనికి చూపించి-

"ఇది మీ గుర్తుగా నావద్ద ఉంచుకొంటా"నన్నది.

అతడు కాదనలేకపోయాడు; నవ్వుకొన్నాడు.

"మీ వియోగజలధి, చూచి నాబోటివాళ్ల కంటనీరు పెట్టడం సహజమే. అది ఆ చిత్తరువు ప్రభావం. కాని సుందరీబాయిగారూ నా రాధాకృష్ణులను జూచి మీ రెందు కంతగా దుఃఖించారో నా కిప్పటికీ అర్ధం కావడంలేదు." అన్నాడు మోహన్.

ఆమెకు తిరిగి కళ్లనీళ్ల తిరిగాయి. పలకలేదు. అతనికి కష్టం కలిగింది.

"మిమ్మల్ని అనవసరంగా కష్టపెడుతున్నా నేమోనని భయంగా ఉంది క్షమించండి" అన్నాడు.

ఆమె కళ్లు తుడుచుకొని

"మిష్టర్ మోహన్. నేనొక అభాగ్యురాలిని. నన్ను కదిలించకండి" అని అంది.

ఇద్దరూ క్షణం మౌనం.

అతడూరుకోలేక పోయాడు.

"మీ రట్లా అంటుంటే మీ విషయం తెలుసుకోవాలని నాకు కుతూహలం ఎక్కువవుతున్నది. మీ దసలు ఏ వూరు!"

"కలకత్తా"

"ఏం చదువుకున్నారు"

"బి. ఎ"

"మీరింకా ఏఏ చిత్రాలు వ్రాశారు!!"

"ఎన్ని వ్రాసి ఏం ప్రయోజనం. నా జీవితాని కానందం లేదు."

"ఎందువల్ల"

"హృదయేశ్వరుని కోల్పోయిన అభాగ్యశాలిని నేను."

మోహన్ మనస్సు చివుక్కుమన్నది. అతడనుకోలేదు ఆమె వితంతువని. ఆమె ముఖవర్చస్సులో చంద్రకాంతులు మిలమిల మంటున్నవి. వయస్సు ఇరవై సంవత్సరములకు లోపుగా కనిపిస్తున్నది. ఆమె నేత్రాలలో యౌవనం తొణికిసలాడుతోంది. శరీరకాంతి వన్నెపెట్టిన బంగారు చాయల్ని వెదజల్లుతోంది. ఈ సుందరి వితంతువా?

"మిమ్మల్ని దుఃఖంలో ముంచిన మీ పెనిమిటి పేరు నేను తెలుసుకో వచ్చునా"

"యదుకిశోర్ బాబు"

"ఆ! ఆ! యదుకిశోరు భార్యా మీరు! ప్రఖ్యాత చిత్రకళా రహస్య నిధి, మహానటుడు; ఆయన పేరు విన్నాను. ఆయన కాలం చేశారని విన్నాను. పాపం కేవలం పసివాడు.

"నన్ను ప్రేమించి వివాహం చేసుకొన్నారు. ఆయనే నా అపర దైవం అనుకొన్నాను; నా హృదయేశ్వరుడు, నా పెన్నిధి, నన్నే కాకిని చేసి వెళ్ళిపోయాడు" ఆమె వలవల విలపించ నారంభించింది.

మోహన్ నివ్వెరబోతున్నాడు.

"మా తండ్రికి నే నొక్కర్తినే కుమార్తెను. మేము ధనవంతులమే. కాని ధనం మానవునికి ఆనందాన్ని ఇవ్వగలదా? నాకు సంభవించిన దుఃఖం చూచిభరించలేక నా తండ్రికూడా నన్ను దుఃఖసముద్రంలో తోసి వెళ్ళిపోయాడు. నా తల్లిని చిన్నప్పుడే పోగొట్టుకొన్న పాపిని ఏమి చెప్పగలను నా ఉదంతం...." అని ఏడ్చింది.

"ఏడవకండన్నాడు" మోహను.

"నా పద్దెనిమిదవ ఏట వివాహం అయింది. వివాహం అయిన ఆరు నెలలకు....ఆయనతో సహగమనం చేయలేక ఇట్లా బ్రతికి ఉన్నాను."

"అంత హటాత్తుగా ఏమి జబ్బు చేసిందాయనకు?"

"టైఫాయడ్ అని అన్నారు. నాలుగు రోజులుకూడా ఆయన మంచం మీద ఉండలేదు ....పోతూ పోతూ ఆయని నా వద్ద ప్రమాణం తీసుకొని మరీ వెళ్ళిపోయారు"

"ఏమని"

"ఆయన కళాతపస్వి! సౌందర్యోపాసకుడు, సత్యసంధుడు. ఆయ నిక జీవించనని తెలుసుకొన్న తర్వాత నా చెయ్యి తన చేతిలోనికి తీసుకొని సుందరీ! నేనిక జీవించను, నేను గతించిన తర్వాత నీవు సంఘంలో వితంతువుగా జీవించడం నా కిష్టం లేదు!

నీవు పసిదానివి. ఏ పాపమూ ఎరుగని పాలకడలివి నీవు. తిరిగి వివాహం చేసుకొని సుఖంగా జీవిస్తానని నా చేతిలో చేయి వేసి ప్రమాణం చెయ్యి. అని ప్రమాణం చేయించుకొన్నారు."

మోహన్ నిరుత్తరుడయి పోయాడు. అతడు నోరు విప్పలేదు.

"అంతటి ప్రేమ నా మీద ఆయనకు."

"మీరు తిరిగి వివాహం చేసుకొన్నారా"

"లేదు. నే నాయనకు ఈ బాకీ తీర్చుకోలేదు. నేను వివాహం చేసుకొనిన గాని ఆయన ఆత్మకు శాంతి ఉండదని పదేపదే చెప్పి సుందరీ సుందరీ అంటూ నా ఒడిలో తల పెట్టి ప్రాణం విడిచారు......

గదిలో నిశ్శబ్దం. మోహన్‌కు ముచ్చెమటలు పోసినై.

ఆమె ముఖం కప్పుకొని దుఃఖిస్తోంది. లోటాలో మంచినీళ్ళు పోసి ఆమె కందించాడు. నీళ్లు త్రాగి కన్నులు తుడుచుకొని-

"ఆయన గతించిన తర్వాతనే ఈ వియోగ జలధి నేను వ్రాశాను. ఇది పూర్తిచేయడానికి నాకు సంవత్సరం పట్టింది. ఇది ఆయన నాకు పెట్టిన భిక్ష. ఆయన ఆశీర్వచనం వల్లనే ఈ చిత్తరువు వ్రాయగలిగాను.

"ఇప్పుడు తిరిగి వివాహం చేసుకొనే తలంపు మీకుందా"

"అది నా పెనిమిటి ఆనతి"

మోహన్ కాఫీ, ఫలహారం తెప్పించాడు. ఇద్దరూ తిన్నారు. సాయంత్రం ఇద్దరూ కలిసి చల్లగాలికి వాహ్యాళికి వెళ్ళిపోయారు.

## 3

అది కార్తీకమాసం. దీపావళికి పట్టిన ముసుర్లు కాలాన్ని బాగా చల్లపరిచాయి. చలి ముదిరింది. రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలుగుతున్నాయి.

నిరంజనరావు నక్షత్రాలుండి స్వామికి అభిషేకాలు చేయిస్తున్నాడు. మోహన్ మనస్సు తిరిగి అతడు వివాహం చేసుకొంటే స్వామికి ఇత్తడి ధ్వజస్తంభం ఎత్తిస్తానని మొక్కుకొన్నాడు.

తెల్లవారుజాము కోడి కూసింది. నిరంజనరావు నిదుర లేచాడు. తూర్పురేఖ లారుతున్నాయి. కప్పర కప్పర చీకటి వెలవెల్లాడుతోంది. నిరంజనరావు నోటిలో పుల్లపెట్టుకొని దంతధావన చేసుకొంటూ తోటలో తిరుగుతున్నాడు. మంచి బిందువుల భారానికి వికసించిన పుష్పాల విర్రవీగుడు తగ్గింది. ఒకపాల పిట్టల జంట కువకువ మంటూ నిరంజనరావు నెత్తిమీదుగా పిగ్గులు తీర్చింది. పెంపుడు పావురా లెగిరి వచ్చి రెక్కలు గొరుకొంటూన్నది. మొగ నెమిలి ఆడనెమిలిని తరుముతోంది.

పుట్ట బ్రహ్మచారి, నిరంజనరావుకే ఆ వాతావరణం వల్ల మాలిన వికారాలు పుట్టించింది. పట్నం వెళ్ళిన మోహన్ తిరిగి రాలేదు. ఇల్లు చిన్నబోయింది. అతనికి బెంగగా ఉంది. ఇంతలో కాంపౌండుగేటు తీసుకొని చేతులో మూటతో సుబ్బులు లోపలికి వచ్చాడు. అతని వెంటనే పసుపు రంగు చీర కట్టుకొని చీరకొంగు రెక్కలమీద కప్పుకొని ఒక పడుచు పిల్ల అడుగులు తడబడుతూ తరలి వస్తోంది. నిరంజనరావు చూశాడు. సుబ్బులు అతని కాళ్ళకు మొక్కాడు.

"వీరే మన దొర మొక్కు" అన్నాడు సుబ్బులు.

ఆ పిల్ల వచ్చి నిరంజనరావుకి మ్రొక్కింది.

నిరంజనరావు కళ్ళు చెమ్మగిల్లాయి.

"ఇదేరా పెళ్ళికూతురు! సుబ్బులూ మంచి పిల్లనే సంపాదించావు గదరా! నీ పేరెవరే" అని అడిగాడు.

"లక్ష్మి" అన్నది పెళ్ళి కూతురు.

"సంతోషం. వర్ధిల్లండి, వెయ్యేళ్లు వర్ధిల్లండి,....సుబ్బులూ! నీకు కొడుకు పుడితే నన్ను తాతను చేస్తాడు గదరా" అని నవ్వాడు నిరంజనరావు.

సుబ్బులూ, లక్ష్మి, సిగ్గుతో నవ్వుకొన్నారు.

వాళ్లు గుడిసెలో గృహప్రవేశం చేసారు.

వాళ్లను అదే చూపుగా చూచాడు నిరంజనరావు.

పావురాల జంట ఎగిరి మేడమీద వాలింది.

"నా మోహనును పసుపు బట్టలతో నేనీ జన్మలో చూడగలనా" అనుకొన్నాడు నిరంజనరావు.

లోపలికి వెళ్ళి స్నానం చేసి దేవతార్చన పీఠం దగ్గర కూర్చుని రుద్రాక్ష తావళం తిప్పుతూ జపంలో లీనమైనాడు నిరంజనరావు.

సూర్యోదయం అయి పది బారులు పాకింది ప్రొద్దు. ఒంటి కంటు కొన్న చలిని ఎండలో విదిలించింది కుక్క.

వీధి గుమ్మంలో కారు నిలిచిన చప్పుడు. కాంపౌండులో ఎవ్వరూ లేరు. సుబ్బులు కొత్త సంసారం సర్దుకొంటున్నాడు.

కారు దిగి, గేటు తీసుకొని లోపలకు వచ్చాడు మోహను. అతనితో కూడా దిగింది సుందరి. ఆమె కుడిచేతివేలు ఎడం చేత్తో పట్టుకొన్నాడు మోహను. కుడిచేత్తో పంచకుచ్చెళ్లు పట్టుకొని లోపల ప్రవేశించాడు. కారులో సామాను డ్రయివరే దింపుతున్నాడు. "సుబ్బులూ" అనిపిలిచాడు మోహన్.

లోపలినుండి వంట బ్రాహ్మడు సీతయ్య వచ్చి వరండాలో నిలబడి- ఆ వచ్చే యిద్దిరిలో పురుషుడు మోహన్ బాబే.

ఆ అమ్మాయి ఎవరు? అతని కర్థం కాలేదు. కళ్లు చికిలించాడు.

"సీతయ్యా కక్కలేరా"

"జపం చేసుకొంటున్నారు బాబూ" అని లోపలకి పరుగు పెట్టాడు.

"బాబు వచ్చాడు. బాబు బాబు" అని గంతులేసాడు సీతయ్య.

చేతి జపమాలతో సహా బయటికి దూకేడు నిరంజనరావు.

"కక్కా! నమస్కారం.... ఇదుగో మీ కోడలు" మోహను.

నిరంజనరావుకు అయోమయంగా కనిపించింది.

సుందరి వచ్చి ఆయన పాదాలు స్పృసించింది.

తమరిద్దరూ వివాహం చేసుకొన్నామని వివరాలు చెప్పాడు మోహన్. ఆనంద బాష్పాలు జారాయి నిరంజనరావుకు.

4

ఆ వూరిలో నాటక సమాజంలో మోహన్ మెంబరు. మోహన్ చక్కగా పాడగలడు. చక్కగా నటించగలడు. వినోదానికి తనూ అప్పుడప్పుడు నాటకాల్లో వేషాల్లో వేస్తుంటాడు.

ఆరోజు చిత్ర నళీయం నాటకం. అందులో మోహన్ నలుని పాత్ర ధరిస్తాడు. ఆ పాత్ర అతడిదివరకు చాలాసార్లు నటించాడు.

అన్ని విధాలా ఆ పాత్ర ధారణకు తగి ఉన్నాడని అతనికి గొప్పపేరు ఉంది. కేవలం అతనికి నలునిపాత్ర చూడడానికే ఆ పురవాసులా నాటకం ప్రదర్శిస్తూ ఉంటారు.

ఆనాటి నాటకానికి జనం క్రిక్కిరిసి పోయారు నాటకం బాగా రక్తి కట్టింది. మోహను డద్భుతంగా నటించాడన్నా రందరూను.

నాటకం పూర్తయే సరికి రాత్రి రెండు గంటలయింది. మోహనరావు వేషం తీసేశాడు. మొఖాన్నద్దిన రంగు కడుక్కోలేదు. ఇంటికి పోదామని బయటికి వచ్చాడు. గుర్రపుబగ్గీ తీసుకొని వచ్చి గుమ్మంలో నిలిపాడు సుబ్బులు.

"మీ అమ్మగారేరీ" అనడిగాడు మోహన్.

"నాటకం సగం అవుతుండగనే అమ్మ ఇంటికి వెళ్లిపోయిందండి. నే పోయి దిగవిడిచి వచ్చా" అన్నాడు సుబ్బులు.

మోహన్‌కు అర్థంకాలేదు. ఆమె ఎందుకు పోయి ఉంటుంది? శరీరంలో బాగుండలేదా? నిద్ర నిలుపుకోలేక పోయిందా? నాటకం ఆమెకు బాగుండలేదా.

తొందరగా పోనీ యన్నాడు.

గుర్రం తరటు తీసింది.

గుర్రం బగ్గిలోనుండి మేడలోకి ఒకే ఒక అంగవేశాడు మోహన్. చరచరా మేడ మెట్లెక్కి పడక గదిలో ప్రవేశించాడు. మంచం మీద బోర్లా పడుకుని ఏడుస్తోంది సుందరి.

అతని కర్థంకాలేదు, పక్కలో కూర్చుని-

"ఎందుకేడుపు సుందరీ!" అనడిగాడు.

ఆమె సమాధానం చెప్పకుండా లేచి, అతని మెడ కరచుకొని రొమ్ము మీద తలపెట్టుకొని వెక్కివెక్కి ఏడ్చింది.

ఆమె కన్నీరు తుడిచాడు.

"ఏమిటి సుందరీ" అన్నాడు.

"మీరిక ఎప్పుడూ ఇటువంటి నాటకాల్లో నటించనని నా చేతిలో చేయి వేయండి."

"ఎందువల్ల? నా పాత్ర నీ కసహ్యంగా ఉందా?"

"ఏదీ నా కళ్లలోకి చూడండి."

"చూస్తున్నాగా"

"మీ కన్నులు విప్పి నాకు చూపించండి"

"ఏమిటీ పిచ్చి సుందరీ"

ఆమె అతని కళ్ళలోకి వెర్రిగా చూచింది. దుఃఖోద్వేగం వల్ల వగరుస్తోంది. అతని చెక్కిళ్లు వెచ్చగా నిమురుతోంది. అబ్బా! అని అతనిని గాటంగా ముద్దెటుకుంటోంది. తన కన్నీటిధారతో అతని వక్షస్థలం తడుపుతోంది.

మోహనుడికి అయోమయమయిపోయింది.

"కల ఏమైనా వచ్చిందా? భయపడ్డావా?"

ఆమె వీపు చల్లగా నిమిరాడు.

"ఇక ఎప్పుడూ నన్నిట్లాంటి నాటకాలకు తీసుకొని వెళ్ళకండి."

"ఎందువల్ల"

"నా హృదయం పగిలిపోతుంది"

"ఎందుకు"

"మీరు అడవిలో దమయంతిని ఒంటరిగా విడిచి వెళ్ళిపోతూంటే— అబ్బా! నేను భరించలేకపోయాను."

"పిచ్చి సుందరీ"

"ఆ వియోగ ఘట్టం నే చూడలేకపోయాను. నా వియోగ జలధి నా గుండె మీద దెబ్బతీసింది. కుర్చీలో కూర్చోలేక పోయాను. ఇంటికి వచ్చి పడిపోయాను. ఎంత ఆపుకుందామన్నా ఏడుపు ఆగక ఏడుస్తూ పడుకున్నాను.

"ఇంత జాలిగుండె అయితే ఎట్లా?"

"ఎన్నడూ నన్ను విడిచి ఉండనని నా చేతిలో చేయివేసి ప్రమాణం చెయ్యి"

"ఎన్నిసార్లు. ఈ ప్రమాణాలకు మితంలేదా?"

వాళ్ళిద్దరూ అలిసిపోయారో ఏమో, జాం ప్రొద్దెక్కేవరకూ గది తలుపు తెరవలేదు.

## 5

పగలూ, రాత్రి చీకటీ, వెలుగు, ఎండా, వానా, చలీ.

ఆకులు రాలిపోతున్నాయి. చెట్లు చిగురుస్తున్నాయి. ఏమిటీ కాల మహిమ! కాలంలో ఎందుకు వస్తాయో ఈ మార్పులు.

భగవంతునికి నిజంగా జాలి లేదు. కరుణరస మసలే లేదు. అతడు చుప్పనాతి, చరాచర భూతకోటిని సృష్టిస్తాడా! మళ్ళీ నసింపు చేస్తాడు. మానవులను నవ్వించడం తనవంతే, ఏడిపించడం తన వంతే!

"కాలోస్మి లోకక్షయకృత్ప్రవృద్ధో, తానే కాలస్వరూపుడట."

లోకాలను నశింపుజేస్తాడట. తిరిగి సృష్టించి వృద్ధిచేస్తాడట. బడాయిగా చెప్పుకొన్నాడు ఆ శ్రీ కృష్ణపరమాత్మ!

అదేమంటే ఇవి తన లీలలంటాడు. భూతకోటి చేసుకొన్న కర్మాను భూతివలనే పుడుతూంటారుట, చస్తూంటారట. కర్మ సిద్ధాంత మే న్యాయమైతే, ఇక తన మీద మానవులకు భక్తి ఎందుకు? తననే నమ్ముకోమంటాడేమిటి మళ్ళీ? తనని నమ్మనివారిని శిక్షిస్తాడా భగవంతుడు. నమ్ముకున్నవాళ్ళని విడిచిపెడతాడా? అంతా అయోమయం.

గ్రామంలో అమ్మవారు బయలు దేరిందని గ్రామ దేవతకి ఉత్సవాలు చేస్తున్నారు జనం. ఇంటింటా వేపాకు తోరణాలు కడుతున్నారు.

డాక్టర్లు వచ్చి ప్రజలకు ఇంజక్షన్లు ఇచ్చి పోతున్నారు.

ఏ ఇంట బట్టినా మశూచికం, తగిలిందంటే అట్లాపోయారన్న వార్తే ఎక్కడ బట్టినా.

సుబ్బులుకి మశూచి తగిలిందని ఆస్పత్రికి తీసుకుపోయారు. డాక్టర్లు కూడా లక్ష్మి వెళ్ళిపోయింది.

నిరంజనరావు భయపడ్డాడు. అమ్మవారు తన కాంపౌండులోకే ప్రవేశించింది. మోహన్‌రావునీ సుందరినీ పట్నం వెళ్ళిపొమ్మని తొందర చేశాడు. వాళ్ళు కదలలేదు.

మర్నాడే సుందరికి జ్వరం తగిలింది. నిరంజనరావు నిలువునా నీరై పోయాడు.... జ్వరమేమిటి అది మశూచే...

తీసుకొని ఆమెను ఆస్పత్రిలో పడెయ్యడానికి వచ్చారు డాక్టర్లు. మోహనరావు అంగీకరించలేదు. నిరంజనరావు గొల్లున గోలపెట్టాడు.

కాని చట్టాన్ని దిక్కరించడం ఎవరి తరం?

సుందరిని తీసుకుపోయి స్పెషల్ వార్డులో పడుకోబెట్టారు.

సుబ్బులు జనరల్ వార్డులో, సుందరి స్పెషల్ వార్డులో ఉన్నారు. మోహనరావు డాక్టర్లకు పందలూ వేలూ గుప్పించి మందులిప్పించాడు. ఇద్దరికీ అంటే లక్ష్మికి, సుందరికి భూమి మీద నూకలున్నందువల్ల ఇద్దరూ బ్రతికారు కాని ఏం ప్రయోజనం. సుబ్బులికి రెండుకాళ్ళూ పడిపోయాయి, సుందరికి ఒక కన్ను పోయింది.

## 6

అబ్బాయి! మోహనా!

అతడు పలకలేదు. నిరంజనరావు దగ్గరికి వచ్చి మీద చేయివేసి "భగవంతుడు చేసినదానికి దానిమీద క్రోధం సాధించి ఏం ప్రయోజనం"

"భగవంతుడున్నాడని మీకింకా నమ్మకమేనా?"

"మన నమ్మకాలతో ఆయనకు పనిలేదు నాయనా! మనం నమ్మినంత మాత్రాన ఉండకుండా పోనూపోదు. కాని నీ భార్యకు మశూచివచ్చి కన్ను పోయినందుకు ఎవరిని దూషిస్తావు?"

అతడు పలకలేదు.

"ఇంకా నయం చావు తప్పి కన్నులొట్టపోయిందన్నట్టు, అంత పోతపోసి అది బ్రతికి బయట పడ్డది అందుకే సంతోషిస్తున్నాను."

"మీరు సంతోషించండి! నాకు లేదు సంతోషం."

"ఎవరి మీదరా ఈ కోపం?"

"నా మీదనే"

"ఎందుకూ"

"నా జీవితం ఇట్లా భగ్నమై పోయిందని"

"నీ జీవితమేమి భగ్నమైయింది,"

"నేనిక ఆ భార్యతో జీవించలేను"

"జబ్బుచేసి కన్నుపోయి కురూపులయిన భార్యలనందరినీ భర్తలు నీలాగే విసర్జిస్తున్నారురా"

"అందరి సంగతీ నాకక్కర్లేదు. నా సంగతే నేను చూచుకొంటాను."

"ఈ రోజున భార్యలకు పట్టిన స్థితి భర్తలకు సంభవిస్తే భార్యలా భర్తలను విసర్జించవలసిందేనా?"

"అదే నేనయితే ఆమె చేత చెప్పించుకోకుండా నేనే లేచి పోయి యుందును"

"నీవు విడిచిపెట్టినా ఆమె విడిచిపెట్టనంటే"

"ఇష్టపడితే ఆమె నాతో యుండవచ్చు.కానీ నాకు మాత్రం ఇప్పుడామె అక్కర్లేదు"

"అక్కర్లేక ఆమె నేం చేస్తావు"

"ఆమె మనవర్తికి భరణం ఇచ్చి ఎక్కడకైనా పొమ్మంటాను.

"ఎక్కడకో పొమ్మండం దేనికి, మన యింట్లోనే ఉండనీ. అ
నీ కంట పడకుండా చూచే భారం నాది"

"వల్లకాదు. అది నా ఆవరణలో ఉండడానికి వీలులేదు!"

"ఆమె నా సౌందర్య కళా జీవితానికి దిష్టిబొమ్మ"

"శివశివా" ఆమె మీదగల ప్రేమ ఏమయిపోయినదిరా!"

"ఇప్పటికీ ఆమెమీద ప్రేమ లేకపోలేదు"

"ప్రేమ ఉండబట్టేనా ఆమెను విడిచిపెట్టేది?"

"అటువంటి అనాకారితో కురూపితో నేను ఎదురెదురుగా ఉండి
జీవితం గడపలేను."

"అయితే మళ్లా పెళ్లి చేసుకుంటావా?"

"ఆహా!"

"ఆమె జీవించి ఉండగా మళ్ళీ ఎల్లా చేసుకుంటావురా?"

"కోర్టు కెక్కి విడాకులు తెచ్చుకుంటాను."

"అందుకామె సమ్మతించకపోతే"

గుమ్మాని కడ్డంకట్టిన తెర తొలగించుకొని లోపలికి వచ్చి మామగారి
కాళ్లు పట్టుకొన్నది సుందరి.

"మామయ్యగారూ! మీకాళ్ళకి మ్రొక్కుతా ఆయన్ని నిర్బంధం
చేయకండి. ఆయన్ని బాధించకండి. మోహన్? మీరు కష్టపడవద్దు. నాది
అభాగ్యజీవితం. నా వలన మీరు బాధపడవద్దు విడాకులకు నేను సమ్మతిస్తా.
మీరు తిరిగి వివాహం చేసుకొని సుఖించడమే నాకు కావలసింది. నే
వెళ్ళిపోతా. మీ రాధాకృష్ణుల కిచ్చిన ద్వితీయ బహుమానం మట్టుకు మీ
గుర్తుగానే తీసుకొని పోతున్నాను. ఇదే నా కడసారి నమస్కారం.
మామయ్యగారూ! నమస్కారం శలవిప్పించండి."

అని కిందికి దిగిపోయింది సుందరి.

నిరంజనరావు పసిపిల్లవాడిలా ఏడ్చి ఆమెతోకూడా క్రిందికి వచ్చి
"అమ్మా నిలు నిలు" అన్నాడు

సుందరి నిలువలేదు. వడివడిగా అడుగులు వేసుకుంటూ గేటు వైపుకు వెడుతోంది. నిరంజనరావు ఆమె వెనకాలె వెళ్లాడు.

ఇద్దరూ గేటు దగ్గరుకు వచ్చారు.

లక్ష్మి ఎదురయింది. కూడా పొట్టచక్రాలుగల పెట్టెబండిలో కాళ్ళు పడి పోయిన సుబ్బులు కూర్చున్నాడు. బండికి తాడుకట్టి లాక్కుని వస్తోంది లక్ష్మి. సుందరిని చూచి

అమ్మా, అమ్మా సుందరమ్మగారూ పెద్దదొరగారూ? బాగుండారా? ఎక్కడికి పోతుండారు?

అని పలకరించింది దెబ్బకొట్టినట్టు నిలిచిపోయారు.

సుందరీ నిరంజనరావులు.

"దొరా దండాలు? నాకు రెండు కాళ్ళు పడిపోయాయి. లేవలేను, కదలలేను. అంత జబ్బుచేసి బతికాను దొరా! లక్ష్మి కూలిపనిచేసి నన్ను బ్రతికిస్తోంది. అమ్మగారికి జబ్బు చేసినతర్వాత మళ్ళా మళ్ళా మేము చూడలేదు. చిన్నదొరగారి కోసరం నా కళ్ళుకాయలు కాచిపోయినై. ఒకసారి మీ అందర్నీ చూచిపోదామని వచ్చా. లక్ష్మి నాకోసరం పెట్టెబండి చేయించింది దొరా! నన్ను దీనిలో కూర్చోపెట్టి ఊరంతా తిప్పుతుంది. ఎప్పుడూ నేను ఇంట్లోనే కూర్చుంటే కాళ్ళు పోయాయనే దిగులుతో దిగ్గుళ్ళి పోతానని దాని భయం సామీ! అది భూదేవి లాటిది దొరా! నా అదృష్టం కొద్దీ దొరికింది బాబూ" అని గడగడా పాఠం చెప్పినట్టు చెప్పాడు సుబ్బులు.

"ఊరుకో వొస్సీ నీదంతా ఇడ్డూరం గంతలా కాళ్ళు పడిపోతే పెనిమిటిని ఇడిసిపోతారా లోకంలో దొరా. అమ్మగారూ? చిన్నదొరగారు బాగుండారమ్మా, మీకో కన్ను పోయిందటగామ్మ, పోనీలెమ్మ బతికి మళ్ళా కళ్ళ బడ్డావు. అంతేచాలు అన్నది లక్ష్మి.

నిరంజనరావు నిర్ఘాంతపోయి లక్ష్మివైపే చూస్తున్నాడు. మేడమీద డాబా చివర నిలబడి చూస్తున్నాడు మోహనరావు.